సమాజాభివృద్ధి కోసం మా అక్షర పోరాటం

# శ్రీ సీమకిరణం

SK1 one NEWS HD

www.seemakiranam.com
www.seemakiranamnews.com
epaper.seemakiranam.com

ప్రచురణ : కర్నూలు & శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు జిల్లా.

SEEMAKIRANAM TELUGU DAILY

ఎడిటర్ : యస్. నజీర్ అహ్మద్ బాషా

జాతీయ తెలుగు దినపత్రిక

PUBLISHED BY : KURNOOL & SRI POTTI SRIRAMULU NELLORE DISTRICT

ప్రచురణ : కర్నూలు, నెల్లూరు. | ఎడిటర్ : ఎస్. నజీర్ అహ్మద్ భాష | సంపుటి : 08 సంచిక : 855 | పేజీలు : 04, వెల రూ. 2 రూ/ | బుధవారం 15-07-2026

# అభివృద్ధి పనులను ఆలస్యం చేయవద్దు

- పనికిరాని నిబంధనలు రద్దు చేయండి!
- ఆర్టీజీఎస్ సమీక్షలో చంద్రబాబు దిశానిర్దేశం
- పాతకాలపు బిజినెస్ రూల్స్‌లో సంస్కరణలకు సీఎం ఆదేశం
- ఫిర్యాదుల స్వీకరణకు క్రౌడ్ సోర్సింగ్ విధానాన్ని అమలు చేయాలి
- 21 ప్రముఖ దేవాలయాలను గ్రోత్ సెంటర్లుగా అభివృద్ధి చేయాలని సూచన
- ఫైళ్ల క్లియరెన్స్ పేరుతో అభివృద్ధి పనులను ఆలస్యం చేయవద్దు
- 22ఏ భూ వివాదాలను పరిష్కరించి అవకాశాలు సృష్టించాలని దిశానిర్దేశం



**అమరావతి :**
ప్రభుత్వ పాలనలో వేగం పెంచేందుకు, అభివృద్ధి పనుల్లో జాప్యాన్ని నివారించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఫైళ్ల క్లియరెన్స్ పేరుతో అభివృద్ధి ఆలస్యం కాకూడదని స్పష్టం చేసిన ఆయన, అవసరం లేని, పాతబడిపోయిన 'బిజినెస్ రూల్స్'ను సంస్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం తక్షణమే ఒక కమిటీని ఏర్పాటు చేసి, నిబంధనలను సరళతరం చేయాలని నిర్దేశించారు. మంగళవారం సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్సు (ఆర్టీజీఎస్) కేంద్రంలో వివిధ ప్రభుత్వ శాఖల పనితీరుపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రోయాక్టివ్ గవర్నెన్స్ అందించడంపై అధికార యంత్రాంగం దృష్టి సారించాలన్నారు. ఉన్నతాధికారులు సరైన నాయకత్వంతో పనిచేస్తేనే ప్రభుత్వ ఫలాలు చిట్టచివరి వ్యక్తి వరకు చేరతాయని స్పష్టం చేశారు. టెక్నాలజీని - మిగతా 2 లో

## ఏపీలో 'ఎస్ఐఆర్' గడువు పొడిగించిన ఈసీఐ




- ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ గడువు పొడిగింపు
- గడువును జులై 24 వరకు పెంచుతూ ఈసీఐ నిర్ణయం
- రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి అభ్యర్థన మేరకు సవరించిన షెడ్యూల్ విడుదల
- ఇప్పటివరకు 88 శాతం ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ పూర్తి
- సవరణ ప్రక్రియలో 14 లక్షల మంది మరణించినట్లు, 12 లక్షల మంది వలస వెళ్లినట్లు గుర్తింపు

**అమరావతి :**
ఏపీలో ఓటర్ల జాబితాకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ గడువును జులై 24వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. వాస్తవానికి ఈ గడువు నేటితో (జులై 14) ముగియాల్సి ఉంది. అయితే, క్షేత్రస్థాయిలో ప్రక్రియ ఇంకా పూర్తికానందున గడువును పెంచాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) చేసిన విజ్ఞప్తికి ఈసీఐ - మిగతా 2 లో



## ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఆరుగురు మత్స్యకారులు ప్రాణాలు కోల్పోయారు

- వైసీపీ అధినేత జగన్
- మత్స్యకార మృతుల కుటుంబాలను పరామర్శించిన జగన్
- మత్స్యకారులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శ
- ఆ రోజు రాత్రి 10.30 గంటలకు బాధితులు కలెక్టర్, మెరైన్ సీఐకి మెసేజ్ పెట్టినా స్పందించలేదని ఆగ్రహం

**అమరావతి :**
మత్స్యకారులను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వైసీపీ అధినేత జగన్ విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ఈ నెల 4న జరిగిన పడవ ప్రమాదంలో ఆరుగురు మత్స్యకారులు ప్రాణాలు కోల్పోయారని ఆరోపించారు. విశాఖపట్నం సమీపంలోని జబ్బర్ తోటలో - మిగతా 2 లో

## అవమానించారు క్షమాపణ చెప్పాల్సిందే




- రాహుల్ గాంధీకి మెల్‌బోర్న్ నిర్వాహకుల ఘాటు లేఖ
- 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' సభపై కాంగ్రెస్ ఆరోపణలను ఖండించిన నిర్వాహకులు
- 'పెయిడ్ క్రౌడ్' వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని రాహుల్, ఖర్గేలకు డిమాండ్
- రాజకీయాల్లోకి ప్రవాస భారతీయులను లాగొద్దని బహిరంగ లేఖలో విజ్ఞప్తి

**ఢిల్లీ :**
ఆస్ట్రేలియాలో జరిగిన 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' కార్యక్రమానికి హాజరైన వేలాది మంది ప్రవాస భారతీయులను 'కిరాయి జనం' (పెయిడ్ క్రౌడ్) అని కాంగ్రెస్ నేతలు చేసిన వ్యాఖ్యలపై తీవ్ర దుమారం రేగింది. ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తూ కార్యక్రమ నిర్వాహకులు లోక్‌సభ ప్రతిపక్ష నేత - మిగతా 2 లో



2 లో

## పీవోకేలో పాక్ దమనకాండ

- ఆరుగురు మృతి, భారత్ తీవ్ర విమర్శ
- పాక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పీఓకే ప్రజల ఆందోళన
- పాక్ పోలీసులు, రేంజర్ల కాల్పుల్లో ఆరుగురు మృతి
- తమ ప్రాణాలు కాపాడాలని భారత్ కు పీవోకే ప్రజల విన్నపం

## భారత్ చుట్టూ విదేశీ నిఘా?

- భారత్ చుట్టూ విదేశీ పౌరుల వరుస ఘటనలు
- అమెరికన్, ఉక్రెయిన్ పౌరుల కేసులతో చర్చ
- నేపాల్ సరిహద్దులో అమెరికా పౌరుడు అరెస్టు
- మయన్మార్ కేసులో కొనసాగుతున్న ఎన్ఐఏ దర్యాప్తు



2 లో

## ఆ పాటతో ఒకరు సీఎం అయ్యారు.. అందుకే నాకు కోపం



- కవిత ఆసక్తికర వ్యాఖ్యలు
- చిన్న సినిమాలకు, నిర్మాతలకు అండగా ఉంటామని కల్వకుంట్ల కవిత హామీ
- భవిష్యత్తులో అధికారంలోకి వస్తే కొత్త సినీ పాలసీ తెస్తామని ప్రకటన
- 'మూడు రంగుల జెండా' పాటతో ఒకరు సీఎం అయ్యారంటూ ఆసక్తికర వ్యాఖ్య
- రాష్ట్రాలు విడిపోయినా తెలుగు ప్రజలమంతా ఒక్కటేనని పిలుపు

**హైదరాబాద్ :**
చిన్న సినిమా నిర్మాతలకు తమ పార్టీ అండగా నిలుస్తుందని, భవిష్యత్తులో తమకు రాష్ట్రాన్ని నడిపించే అవకాశం లభిస్తే వారికి మేలు చేసేలా కొత్త సినీ విధానాన్ని తీసుకొస్తామని కల్వకుంట్ల కవిత అన్నారు. అదే సమయంలో ఇటీవలి ఎన్నికల్లో ఓ వ్యక్తిని ముఖ్యమంత్రిని చేసినంతగా ప్రజాదరణ పొందిన పాటకు సంగీతం సమకూర్చిన చరణ్ అర్జున్‌పై తనకు కాస్త కోపం ఉందని సరదాగా ఆమె చేసిన వ్యాఖ్యలు రాజకీయ, - మిగతా 2 లో

## ఇది స్కూలా, లేక ఐఏఎస్, ఐపీఎస్ ఫ్యాక్టరీనా?

- ఝార్ఖండ్‌లో 'ఐఏఎస్ ఫ్యాక్టరీ'గా పేరొందిన నేతర్‌హాట్ స్కూల్
- ఈ స్కూల్ నుండి ఇప్పటివరకు సుమారు 3,000 మంది ఐఏఎస్, ఐపీఎస్‌లు
- ఈ పాఠశాలను ప్రశంసించిన తొలి రాష్ట్రపతి రాజేంద్ర ప్రసాద్
- పలువురు మాజీ సీబీఐ డైరెక్టర్లు, ఉన్నతాధికారులు ఇక్కడి పూర్వ విద్యార్థులే




2 లో

## ఊరూరా తిరిగి బీఆర్ఎస్ కుట్రలను ప్రజలకు తెలియజేస్తాం



- మంత్రి పొన్నం ప్రభాకర్
- కాళేశ్వరం కుంగిపోవడానికి బీఆర్ఎస్ కారణమన్న పొన్నం ప్రభాకర్
- మేడిగడ్డ, కన్నెపల్లి విషయంలో రాజకీయం చేస్తున్నారని విమర్శ
- ఎల్‌నినోను ఎదుర్కోవడానికి ప్రభుత్వం తరపున సూచనలు చేస్తున్నామని వెల్లడి

**హైదరాబాద్ :**
కాళేశ్వరం ప్రాజెక్టు సంక్షోభం, రాష్ట్రంలో నెలకొన్న సాగునీటి సమస్యలపై బీఆర్ఎస్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ మరోసారి విరుచుకుపడ్డారు. నిన్న బీఆర్ఎస్ శ్రేణులు రక్తం ప్యాకెట్లతో సీఎం రేవంత్ రెడ్డి నివాసాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రక్తం ప్యాకెట్లతో రాజకీయం చేయాల్సిన అవసరం లేదని బీఆర్ఎస్‌పై మండిపడ్డారు. - మిగతా 2 లో




## మీనాక్షి నటరాజన్‌కు కడియం శ్రీహరిపై కొండా సురేఖ ఫిర్యాదు

- కొండా సురేఖ, కడియం శ్రీహరి మధ్య వివాదం
- శ్రీహరి తన ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారన్న సురేఖ
- సంయమనం పాటించాలన్న మీనాక్షి నటరాజన్

**హైదరాబాద్ :**
తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య నెలకొన్న వివాదం కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ వద్దకు చేరింది. - మిగతా 2 లో

## అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదు

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌లను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలని వినతి
- 2028 జూన్ 2 నాటికి వరంగల్ విమానాశ్రయం సిద్ధం చేయాలని కోరిన ముఖ్యమంత్రి
- కాకతీయ సంస్కృతి ఉట్టిపడేలా వరంగల్ ఎయిర్‌పోర్ట్ డిజైన్ ఉండాలని సూచన
- వేగంగా భూసేకరణ పూర్తి చేయడంపై తెలంగాణ ప్రభుత్వాన్ని అభినందించిన కేంద్రం



**హైదరాబాద్ :**
అభివృద్ధిని రాజకీయాలతో ముడిపెట్టకూడదని, రాజకీయాలు కేవలం ఎన్నికల సమయానికే పరిమితం కావాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్న వరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కోరారు. ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాలకు వరంగల్ కేంద్రంగా ఉంటుందని, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌తో పాటు ఇతర పరిశ్రమల రాకతో నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతున్నందున విమానాశ్రయం ఎంతో కీలకమని ముఖ్యమంత్రి... కేంద్రమంత్రికి వివరించారు. భూసేకరణ ప్రక్రియ పూర్తయినందున వెంటనే టెండర్లు పిలిచి, 2028 జూన్ 2 నాటికి పనులన్నీ పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆదిలాబాద్‌లో రక్షణ శాఖ ఆధీనంలోని ఎయిర్‌పోర్ట్‌తో పాటు పౌర విమానాశ్రయాన్ని కూడా నిర్మించాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ రెండు విమానాశ్రయాల్లోనూ విమాన శిక్షణా సంస్థలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. హుస్సేన్ సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు సీప్లేన్‌లు నడిపే అంశాన్ని పరిశీలించాలని కోరగా, దీనిపై తగిన ప్రతిపాదనలు అందజేయాలని కేంద్రమంత్రి సూచించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. దేశంలోని ఏ రాష్ట్రం చేయనంత వేగంగా తెలంగాణ ప్రభుత్వం భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అభినందించారు.

**వరంగల్ కీలకం**
ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మంలతో పాటు నల్గొండకు వరంగల్ కేంద్ర బిందువుగా - మిగతా 2 లో

# సంపాదకీయం

## అనిశ్చితిలో వెలుగురేఖ

'బలవంతుడ నాకేమని...' అనుకుంటే దశాబ్దాల తరబడి అమెరికా నిర్మించుకుంటూ వస్తున్న పునాదులు కదిలిపోతాయని ఆ దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు ఇంకా జ్ఞానో దయం కాలేదు. నాటో శిఖరాగ్ర సదస్సుకు పోయి ఈసారి కాస్తంత స్నేహపూర్వకంగా మాట్లాడినా అటువైపునుంచి మునుపటి సాన్నిహిత్యం లేదని తుర్కియేలో ముగిసిన ఆ సదస్సు తీరుతెన్నులు చెబుతున్నాయి. అమెరికాతో ఇప్పటికీ సన్నిహిత సంబంధాలే ఉన్న మన దేశం సైతం ఆయన తరచు చేసే ప్రకటనల కారణంగా ఇబ్బంది పడుతోంది. హఠాత్తుగా 'ఇండో--పసిఫిక్' పేరు మారాక లోలోన అసంతృప్తి సరేసరి. ఈ నేపథ్యంలో ఇండో--పసిఫిక్ విషయంలో మన వైఖరిని తేటతెల్లం చేసేలా, మన చొరవను మరింత పెంచేలా ప్రధాని నరేంద్ర మోదీ ఇండొనేసియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో ఆరు రోజుల పర్యటన ఈ నెల 6న మొదలైంది. ఇప్పటికే ఇండొనేసియా, ఆస్ట్రేలియా పర్యటనలు పూర్తి చేసుకున్న మోదీ శుక్రవారం న్యూజిలాండ్ చేరుకున్నారు. అమెరికా, చైనాలతో... వాటి వైఖరులతో సంబంధం లేకుండా భద్రత, వాణిజ్యం తదితర రంగాల్లో భిన్న దేశాల సహకారం అవసరమని మన దేశం భావించబట్టే ఈ పర్యటన ఖరారైంది. ఈ మూడూ సాగరప్రాంత దేశాలు. ఎప్పుడో 1992లోనే రూపుదిద్దుకున్న 'లుక్ ఈస్ట్' విధానానికి కొనసాగింపుగా మన దేశం 'మహాసాగర్' దార్శనికతను ప్రతిపాదించింది. పరస్పర సంపూర్ణ అభివృద్ధికి ప్రాంతాలవారీ భద్రత, సమగ్రవృద్ధి అవసరమన్నదిదాని సారాంశం. సాధారణ ఆర్థిక సంబంధాలు మొదలుకొని భారీ రక్షణ, ఇంధన భాగస్వామ్యం వరకూ అనేకం దీని పరిధిలోకొస్తాయి. ఆస్ట్రేలియాతో గురువారం కుదిరిన పౌర అణుశక్తి ఒప్పందం చరిత్రాత్మకమైనది. ఇదిగాక ఆధునిక సాంకేతికతలూ, రక్షణ, భద్రత సహకారం, సరఫరా గొలుసు మెరుగు పరచటం తదితరాలకు సంబంధించి మరో 18 ఒప్పందాలు కుదిరాయి. పారిస్‌ఒప్పందం కింద స్వచ్ఛ ఇంధన లక్ష్యం సాధనకు మన అణు రియాక్టర్లకు నిరంతరాయంగా యురేనియం అవసరమవుతుంది. ప్రస్తుతం ఉన్న 7.7 గిగావాట్ల అణు విద్యుత్‌ను 2047కల్లా 100 గిగావాట్లకు పెంచాలని భారత్ నిర్దేశించుకుంది. ఇందుకోసం ప్రపంచ యురేనియం నిక్షేపాల్లో 28 శాతంగల ఆస్ట్రేలియాతో ఒప్పందం కుదరటం కీలక పరిణామం. ప్రపంచ పరిణామాల కారణంగా హఠాత్తుగా నిలిచిపోతున్న ఇంధన సరఫరా తీరును సరిదిద్దటానికి ఎల్ఎన్‌జీ, బొగ్గు, డీజిల్‌వంటి సంప్రదాయ ఇంధన వనరుల విషయంలో పరస్పరం సహకరించుకుంటూ ఇంధన భద్రతను బలోపేతం చేసుకోవాలని రెండు దేశాలూ నిర్ణయించుకున్నాయి. ఏనాటి నుంచో సాన్నిహిత్యంగల ఇండొనేసియాతో మరిన్ని రంగాల్లో సహకారానికి ఈ నెల 6నుంచి 8వరకూ వరసగా మూడురోజులపాటు కొనసాగిన పర్యటనలో ఒప్పందాలు కుదిరాయి. మన బ్రహ్మోస్, అస్త్ర క్షిపణుల్ని కొనుగోలు చేయటానికి ఇండొనేసియా ఒప్పందం కుదుర్చుకుంది. ఇరు దేశాలూ కలిసి ఇండొనేసియాలోని, అండమాన్, నికోబార్ దీవుల్లో నౌకాశ్రయాలను నిర్మించటానికి కూడా అధినేతలిద్దరూ అంగీకరించారు. అలాగే హిందూసముద్రం మొదలుకొని పసిఫిక్ మహాసముద్రంవరకూ పరస్పర సహకారంతో సముద్రజలాల్లో భద్రతను పెంచటానికి ఒప్పందం కుదిరింది. ఇప్పటికే జపాన్, దక్షిణ కొరియాలతో ఉన్న సహకారానికి ఇండొనేసియా కూడా తోడుకావటం వల్ల ఇండో--పసిఫిక్‌లో పటిష్టమైన సమన్వయం ఏర్పడుతుంది. చైనాతో అంటకాగటానికిట్రంప్ ప్రయత్నిస్తున్న దశలో ఇది కీలక పరిణామం. నిరుడు మన దేశంలో న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ పర్యటించినప్పుడు ద్వైపాక్షిక రక్షణ సహకార ఒప్పందం కుదిరింది. దాంతోపాటు మొన్న ఏప్రిల్‌లో రెండు దేశాలూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ) కుదుర్చుకున్నాయి. దీన్ని మున్ముందు మరింత విస్తృతపర్చుకోవటానికి ఇప్పటికే ఇరు దేశాలూ నిర్ణయించుకున్నాయి. కూటముల్లో చేరే విషయంలో న్యూజిలాండ్‌కు పెద్దగా ఆసక్తి లేదు. అయితే ప్రాంతీయ భద్రతను పెంపొందించుకోవటానికి భారత్, ఆస్ట్రేలియాలతో కలిసి పనిచేయాలని ఇప్పటికే నిర్ణయించుకుంది. మొత్తానికి మోదీ మూడు దేశాల పర్యటన ఇండో--పసిఫిక్‌లో భారత్ పలుకుబడిని మరింత పెంచుతుంది.

## ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఆరుగురు మత్స్యకారులు ప్రాణాలు కోల్పోయారు

**మొదటిపేజీ తరువాయి -** బాధిత మత్స్యకార కుటుంబాలను, ప్రమాదం నుంచి బయటపడిన చిన్నాను జగన్ పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ప్రమాదం జరిగిన వెంటనే ప్రభుత్వం ఎందుకు స్పందించలేదని నిలదీశారు. తీరానికి 10 మైళ్ల దూరంలోనే ఘటన జరిగినా, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఆరుగురు మత్స్యకారులు జలసమాధి అయ్యారని దుయ్యబట్టారు. ఆ రోజు రాత్రి 10.30 గంటలకు బాధితులు కలెక్టర్, మెరైన్ సీఐకి మెసేజ్ పెట్టినా స్పందించలేదన్నారు. 5వ తేదీన చైనా బోటు సిబ్బంది చిన్నాను కాపాడటంతో అతను బ్రతికి బయటపడ్డాడని తెలిపారు. ప్రభుత్వం తప్పు చేసింది కాబట్టే త్రీమెన్ కమిటీ వేశారని, ఆ నివేదిక కూడా తప్పులతడకగా ఉందన్నారు. ప్రభుత్వానికి మానవత్వం లేదని, ఉంటే రూ.10 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకునేవారు కాదన్నారు. ఇప్పటికైనా బాధితులకు రూ.కోటి చొప్పున ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని, మత్స్యకార బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. వైసీపీ మళ్లీ అధికారంలోకి వచ్చిన నెలలోపే బాధిత కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

## అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదు

**మొదటిపేజీ తరువాయి -** ఉంటుందని ముఖ్యమంత్రి తెలిపారు. రైలు, రోడ్డు మార్గాలతో మెరుగైన అనుసంధానం ఉండటంతో పాటు కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ వంటి పరిశ్రమలతో ఈ నగరం మరింత కీలకంగా మారుతుందన్నారు. రానున్న రోజుల్లో వరంగల్‌ను పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదని, రాజకీయా లను కేవలం ఎన్నికలకే పరిమితం చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. వివిధ అంశాల్లో కేంద్ర ప్రభుత్వం తమకు సహకరిస్తోందని, ఏవైనా సమస్యలు ఉంటే కేంద్ర మంత్రులను కలిసి చర్చిస్తున్నామని తెలిపారు. ఏదైనా సమాచార లోపం ఉంటే దానిని పరస్పరం మార్చుకోవడం ద్వారా అధిగమిస్తున్నామని ఆయన వివరించారు.

## ఊరూరా తిరిగి బీఆర్‌ఎస్ కుట్రలను ప్రజలకు తెలియజేస్తాం

**మొదటిపేజీ తరువాయి -** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడక ముందే కాళేశ్వరం కుంగిపోయిందని, దీనికి బీఆర్ఎస్ కారణమని ఆరోపించారు. ప్రతి గ్రామానికి వెళ్లి బీఆర్ఎస్ చేసిన కుట్రలను ప్రజలకు తెలియజేస్తావ న్నారు. ఎన్‌డీఎస్ఏ తుది నివేదిక ఇచ్చి కాళేశ్వరంలో నీటిని నింపమని చెబితే వెంటనే నింపుతామని చెప్పారు. ఇంజనీర్ల సలహాలను పాటిస్తామని తెలిపారు. ఎన్‌డీఎస్ఏ సూచనల మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు. కరవును దృష్టిలో పెట్టుకొని ప్రజలను రెచ్చగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కావాలనే మేడిగడ్డ, కన్నెపల్లి విషయంలో రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. ఈ ఏడాది వర్షాలు తక్కువ పడతాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారన్నారు. ఎల్‌నినోను ఎదుర్కోవడానికి ప్రభుత్వం తరపున సూచనలు చేస్తున్నామని తెలిపారు. కరవును దృష్టిలో పెట్టుకొని రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాన్ని ఎదుర్కోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలుగా అంతర్గత సమస్యలు ఉన్నా కలిసి ఎదుర్కోవాలని, బాధ్యత కలిగిన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ సలహాలు ఇవ్వాలని కోరారు.

## పీవోకేలో పాక్ దమనకాండ

**మొదటిపేజీ తరువాయి -** పాకిస్థాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఆందోళన చేస్తున్న నిరసనకారులపై పాక్ పోలీసులు, రేంజర్లు కాల్పులు జరపడంతో ఆరుగురు మృతి చెందారు. పదుల సంఖ్యలో ఆందోళనకారులు గాయపడ్డారు. కొంతకాలంగా పీవోకేలో ఇంటర్నెట్ నిలిపివేయడంతో దాదాపు 40 లక్షల మంది ప్రజలకు బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయని నిరసనకారులు తెలిపారు. తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పీవోకే ప్రజలు వాపోతున్నారు. తమ ప్రాణాలను కాపాడాలని, మానవతా సాయం అందించాలని భారత్‌కు విజ్ఞప్తి చేస్తున్నారు. పూంఛ్, దోడా సెక్టార్లలో నియంత్రణ రేఖను తెరవాలని కోరారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ప్రజలపై పాక్ అణచివేత ధోరణిని భారత్ తీవ్రంగా విమర్శించింది. ఎన్నో ఏళ్లుగా జరుగుతున్న వ్యవస్థాగత దోపిడీ, బలవంతపు ఆక్రమణలు, అణచివేత వల్లే ఈ ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయని విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. ఆహారం, మందుల సరఫరా నిలిపివేత, ఇంటర్నెట్ బ్లాక్‌అవుట్, తీవ్ర హింస పాక్ క్రూరత్వానికి నిదర్శనమని విమర్శించారు. అటు, అమెరికాలో స్థిరపడిన పీవోకే పౌరులు వైట్‌హౌస్ ముందు నిరసన చేపట్టారు. ఈ ఘటనలు పాక్ ఆక్రమణకు వ్యతిరేకంగా పీవోకేలో పెరుగుతున్న అసంతృప్తిని ప్రతిబింబిస్తున్నాయి.

## మీనాక్షి నటరాజన్‌కు కడియం శ్రీహరిపై కొండా సురేఖ ఫిర్యాదు

**మొదటిపేజీ తరువాయి -** మీనాక్షి నటరాజన్‌తో మంత్రి కొండా సురేఖ భేటీ అయి కడియం శ్రీహరిపై ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే తన ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని, అనవసర వివాదాల్లోకి లాగుతున్నారని మీనాక్షి దృష్టికి తీసుకెళ్లారు. ఇద్దరి మధ్య నెలకొన్న వివాదానికి సంబంధించిన అన్ని అంశాలను వివరించారు. సురేఖ వివరించిన అంశాలను ఓపికగా విన్న మీనాక్షి నటరాజన్ సంయమనం పాటించాలని సూచించారు. చిన్నచిన్న విషయాలను పెద్దగా పట్టించుకోవద్దని సలహా ఇచ్చారు. ఈ వివాదంపై ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ను కలిసి కడియంపై సురేఖ ఫిర్యాదు చేశారు.

# అభివృద్ధి పనులను ఆలస్యం చేయవద్దు

**మొదటిపేజీ తరువాయి -** అనుసంధానం చేస్తూ పాలనలో పారదర్శకత తీసుకురావాలని సూచించారు. 2017తో పోలిస్తే రాష్ట్ర స్థూల ఉత్పత్తి 20 శాతం వృద్ధి సాధించిందని, ఈ అవకాశాలను అందిపుచ్చుకునేలా నిబంధనల్లో వెసులుబాటు కల్పించాలన్నారు.

### దేవాలయాలను గ్రోత్ సెంటర్లుగా మార్చాలి

దేవాదాయ శాఖపై సమీక్షలో భాగంగా రాష్ట్రంలోని 21 ప్రముఖ దేవాలయాలను గ్రోత్ సెంటర్లుగా తీర్చిదిద్దాలని సీఎం సూచించారు. ఈ ఆలయాల పరిసరాల్లో ఆర్థిక, పర్యాటక కార్యకలాపాలు పెరిగేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రసాదాల నాణ్యతతో పాటు ఆధ్యాత్మిక వాతావరణాన్ని మెరుగుపరచాలని ఆదేశించారు. అదేవిధంగా, ఆర్టీసీ బస్సులు సరైన సమయానికి నడిచేలా చూడాలని, బస్టాండ్లలో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. అగ్నిమాపక శాఖ సేవల ప్రమాణాలను పెంచాలని, రాష్ట్రంలో యూరియా కొరత రాకుండా రైతులకు భరోసా ఇవ్వాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు.

### ఫిర్యాదుల పరిష్కారానికి క్రౌడ్ సోర్సింగ్

ప్రభుత్వానికి వచ్చే అన్ని ఫిర్యాదుల స్వీకరణకు 'క్రౌడ్ సోర్సింగ్' విధానాన్ని అమలు చేయాలని సీఎం స్పష్టం చేశారు. ప్రతి అర్జీని మానవీయ కోణంలో పరిశీలించి, వేగంగా పరిష్కరించాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాజకీయ కక్షతో కొందరి భూములను 22ఏ జాబితాలో చేర్చారని, ఇలాంటి వివాదాలను పరిష్కరించడం ద్వారా ఎన్నో అవకాశాలను సృష్టించవచ్చని తెలిపారు. శెట్టిపల్లి భూ వివాదం పరిష్కారంతో ప్రభుత్వానికి రూ.900 కోట్ల విలువైన భూమి రావడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ సమీక్షలో మంత్రి కొల్లు రవీంద్ర వర్చువల్‌గా పాల్గొనగా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, ఇతర ఉన్నతాధికారులు



పాల్గొన్నారు. ఈ సమీక్ష అనంతరం, ఆర్టీజీఎస్ రూపొందించిన 'గవర్నెన్స్ దట్ నెవర్ స్లీప్స్' మాసపత్రికను సీఎం ఆవిష్కరించారు.

# ఏపీలో 'ఎస్ఐఆర్' గడువు పొడిగించిన ఈసీఐ

**మొదటిపేజీ తరువాయి -** సానుకూలంగా స్పందించింది. ఈ మేరకు సవరించిన కొత్త షెడ్యూల్‌ను విడుదల చేసింది.

### గడువు పెంపునకు దారితీసిన కారణాలు

గత నెల రోజులుగా ఏపీ వ్యాప్తంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను సరిచూసే ఎస్ఐఆర్ ప్రక్రియను చేపట్టారు. జులై 13 నాటికి దాదాపు 88 శాతం ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ మాత్రమే పూర్తయింది. నిర్దేశిత గడువు సమీపిస్తున్నా ప్రక్రియ వంద శాతం పూర్తికాకపోవడంతో, గడువును పొడిగించాలని పలు రాజకీయ పార్టీలు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనాను కోరాయి. పార్టీల విజ్ఞప్తులు, క్షేత్రస్థాయి పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న సీఈవో.. ఎస్ఐఆర్ ప్రక్రియను సమగ్రంగా పూర్తి చేసేందుకు మరింత సమయం అవసరమని పేర్కొంటూ కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. ఈ అభ్యర్థనను పరిశీలించిన ఈసీఐ, గడువు పొడిగింపునకు అంగీకారం తెలిపింది.

### సవరణలో వెల్లడైన కీలక గణాంకాలు

ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా బీఎల్‌వోలు మొత్తం 4,16,26,144 ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు. సోమవారం నాటికి 3,69,50,812 మంది ఓటర్ల వివరాలను డిజిటలైజ్ చేశారు. ఈ ప్రక్రియలో పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా 14,19,644 మంది ఓటర్లు మరణించినట్లు అధికారులు గుర్తించారు. అలాగే, ఉపాధి, వివాహం, ఇతర కారణాలతో 12,14,994 మంది ఓటర్లు తమ చిరునామా నుంచి శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినట్లు తేలింది. బీఎల్‌వోలు సర్వేకు వెళ్లిన సమయంలో 7,26,425 మంది ఓటర్లు ఇళ్ల వద్ద అందుబాటులో లేరని నివేదికలో పేర్కొన్నారు. ఇంకా 9 శాతానికి పైగా ప్రక్రియ పూర్తి కావాల్సి ఉండటంతో, పొడిగించిన గడువులోగా వంద శాతం డిజిటలైజేషన్ పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

### సవరించిన షెడ్యూల్ వివరాలు

కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన కొత్త షెడ్యూల్ ప్రకారం సవరించిన తేదీలు ఈ విధంగా ఉన్నాయి:

ఎస్ఐఆర్ ప్రక్రియ చివరి తేదీ: జులై 24
ఓటర్ల ముసాయిదా జాబితా ప్రచురణ: జులై 31
అభ్యంతరాలు, చేర్పులు, మార్పుల స్వీకరణ: జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు
అభ్యంతరాలు, దరఖాస్తుల పరిష్కారానికి గడువు: సెప్టెంబరు 28
ఓటర్ల తుది జాబితా అధికారిక ప్రచురణ: అక్టోబరు 3

ఈ పొడిగించిన గడువుతో ఓటర్ల జాబితాను మరింత కచ్చితంగా, తప్పులు లేకుండా రూపొందించేందుకు అవకాశం లభించిందని అధికారులు భావిస్తున్నారు. ముసాయిదా జాబితా విడుదలైన తర్వాత పౌరులు తమ వివరాలను సరిచూసుకుని, ఏవైనా అభ్యంతరాలుంటే నిర్దేశిత సమయంలోగా తెలియజేయాలని ఎన్నికల సంఘం సూచించింది.

## ఇది స్కూలా, లేక ఐఏఎస్, ఐపీఎస్ ఫ్యాక్టరీనా?




**మొదటిపేజీ తరువాయి -** ఝార్ఖండ్ రాష్ట్రం లతేహార్ జిల్లాలోని నేతర్‌హాట్ రెసిడెన్షియల్ స్కూల్ దేశవ్యాప్తంగా 'ఐఏఎస్ ఫ్యాక్టరీ'గా విశేష ఖ్యాతి గడించింది. నాణ్యమైన విద్యకు, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి నిలయమైన ఈ పాఠశాల, ఇప్పటివరకు సుమారు 3,000 మందికి పైగా ఐఏఎస్, ఐపీఎస్ వంటి సివిల్ సర్వీస్ అధికారులను దేశానికి అందించింది. విద్యా ప్రమాణాలకు, విద్యార్థుల క్రమశిక్షణకు ఈ సంస్థ ఒక చిరునామాగా నిలుస్తోం ది. స్వాతంత్ర్యానంతరం ఏర్పాటైన ఈ విద్యాసంస్థ, తన విశిష్టమైన రెసిడెన్షియల్ విద్యావిధానంతో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ప్రత్యేక గుర్తింపు పొందింది. ఝార్ఖండ్‌తో పాటు పరిసర రాష్ట్రాల తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను ఇక్కడ చేర్పిం చడాన్ని ఉన్నత స్థాయి ప్రభుత్వ ఉద్యోగాలకు ఒక రాజమార్గంగా భావిస్తారు. భారత తొలి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ సైతం ఈ పాఠశాల విద్యావిధానాన్ని ప్రశంసించడమే కాకుండా, నైనిటాల్ లోనూ ఇటువంటి పాఠశాలనే ఏర్పాటు చేయాలని నాడు సూచిం చారు. ఈ పాఠశాల పూర్వ విద్యార్థులు నేడు దేశవిదేశాల్లో అత్యున్నత హోదాల్లో కొనసాగుతున్నారు. సుప్రసిద్ధ గణిత శాస్త్రవేత్త వశిష్ట నారాయణ్ సింగ్, సీబీఐ మాజీ డైరెక్టర్లు డాక్టర్ త్రినాథ్ మిశ్రా, డాక్టర్ రాకేశ్ అస్థానా, కేంద్ర మాజీ హోం కార్యదర్శి జేబీ తుబిద్, ఐఏఎస్ అధికారి మనీశ్ రంజన్ వంటి ఎందరో ప్రముఖులు ఇక్కడ చదువుకున్నవారే. కేవలం సివిల్ సర్వీసెస్ మాత్రమే కాకుండా, వైద్య, ఇంజినీరింగ్, పరిపాలన వంటి వివిధ రంగాల్లోనూ వీరు విశేష ప్రతిభను చాటుతున్నారు. ప్రకృతి రమణీయత ఉట్టిపడే కొండల నడు మ నెలకొన్న ఈ పాఠశాల ప్రాంగణం, అక్కడి వారసత్వ కట్ట డాలు పర్యాటకులను సైతం విశేషంగా ఆకర్షిస్తున్నాయి. సామాన్య నేపథ్యం నుంచి వచ్చిన ఎందరో విద్యార్థుల కలలను సాకారం చేస్తూ, నాణ్యమైన విద్యాశక్తికి ఈ సంస్థ ఒక నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది.

## ఆ పాటతో ఒకరు సీఎం అయ్యారు.. అందుకే నాకు కోపం

**మొదటిపేజీ తరువాయి -** సినీ వర్గాల్లో ఆసక్తి రేకెత్తించాయి. దినేశ్ కుమార్, దివిజ ప్రభాకర్ జంటగా నటించిన 'వెంకట్రామయ్య గారి తాలూకా' చిత్ర ప్రీ రిలీజ్ వేడుకకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా చిత్ర సంగీత దర్శకుడు చరణ్ అర్జున్‌ను కవిత ప్రత్యేకంగా ప్రశంసించారు. ఆయన అద్భుతమైన సంగీతాన్ని అందిస్తారని కొనియాడుతూ.. "చరణ్ అర్జున్ స్వరపరిచిన 'మూడు రంగుల జెండా' పాట ఒక వ్యక్తిని ముఖ్యమంత్రిని చేసింది. అంతటి శక్తిమంతమైన పాటను అందించినందుకు ఆయనపై నాకు కాస్త అలక, కోపం వున్నాయి" అని సరదాగా వ్యాఖ్యానించారు. ఈ సినిమా పాటలు కూడా అదే స్థాయిలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. భౌగోళికంగా రాష్ట్రాలు విడిపోయినా తెలుగు ప్రజలంతా ఒక్కటేనని, మనమంతా కలిసి ఉండాలన్నదే తమ ఆకాంక్ష అని స్పష్టం చేశారు. ఇరు ప్రాంతాల సంస్కృతులను పరస్పరం గౌరవించుకున్నప్పుడే భాష, సంస్కృతి నిలబడతాయని, తెలుగు చిత్రసీమ మనందరినీ కలిపే ఒక గొప్ప మాధ్యమంగా ఉండాలని పిలుపునిచ్చారు. చిత్ర పరిశ్రమ ఎదుర్కొంటున్న సవాళ్లపై కవిత తన ప్రసంగంలో ప్రధానంగా దృష్టి సారించారు. "తమిళ, కన్నడ పరిశ్రమల మాదిరిగా మన దగ్గర చిన్న నిర్మాతలకు, థియేటర్లకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు లేవు. ఎంతో ప్రతిభ ఉన్నా సరైన అవకాశాలు దక్కడం లేదు. ఓటీటీల రాకతో మేలు జరుగుతుందని ఆశించినా, అవి కూడా పూర్తిగా వ్యాపార ధోరణిలోనే నడుస్తున్నాయి" అని ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్తులు అమ్మి, సర్వస్వం పణంగా పెట్టి సినిమాలు తీసే చిన్న నిర్మాతలు బాగుంటేనే చిత్ర పరిశ్రమ మనుగడ సాగిస్తుందని ఆమె స్పష్టం చేశారు. "చిన్న నిర్మాతలకు తెలంగాణ రక్షణ సేన అండగా ఉంటుంది. భవిష్యత్తులో మాకు అధికారం వస్తే, తప్పకుండా చిన్న చిత్రాలకు ప్రయోజనం చేకూరేలా సరికొత్త సినీ విధానాన్ని రూపొందిస్తాం" అని కవిత హామీ ఇచ్చారు. కుటుంబ బంధాల నేపథ్యంలో తెరకెక్కిన 'వెంకట్రామయ్య గారి తాలూకా' చిత్రంలో దినేశ్ కుమార్ హీరోగా, ప్రముఖ నటుడు ఈటీవీ ప్రభాకర్ కుమార్తె దివిజ ప్రభాకర్ హీరోయిన్‌గా పరిచయం అవుతున్నారు. సతీశ్ ఆవాల దర్శకత్వం వహించిన ఈ సినిమా ఈ నెల 17న విడుదల కానుంది.

# అవమానించారు.. క్షమాపణ చెప్పాల్సిందే

**మొదటిపేజీ తరువాయి -** రాహుల్ గాంధీ, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలకు ఒక బహిరంగ లేఖ రాశారు. ఆరోపణలను వెంటనే వెనక్కి తీసుకుని, ఆస్ట్రేలియాలోని భారత సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. జులై 9న మెల్‌బోర్న్‌లోని మార్వెల్ స్టేడియంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగం కోసం 30,000 మందికి పైగా ప్రవాస భారతీయులు తరలివచ్చారు. ఆస్ట్రేలియాలో ఒక విదేశీ నేతకు లభించిన అతిపెద్ద స్వాగతాల్లో ఇది ఒకటిగా నిలిచింది. అయితే, ఈ కార్యక్రమానికి హాజరైన వారిని బీజేపీ లేదా భారత ప్రభుత్వం డబ్బులిచ్చి సమీకరించిందని కాంగ్రెస్ నేతలు సోషల్ మీడియాలో ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, ప్రవాస భారతీయులను తీవ్రంగా అవమానించేలా ఉన్నాయని నిర్వాహకులు తమ లేఖలో పేర్కొన్నారు. "ఈ కార్యక్రమం ఆస్ట్రేలియాలోని భారత సమాజం స్వచ్ఛందంగా, ఎంతో ఉత్సాహంగా చేసుకున్న వేడుక. దీనికి ఎలాంటి రాజకీయ పార్టీ లేదా ప్రభుత్వం నిధులు సమకూర్చలేదు. సిడ్నీ వంటి ఇతర నగరాల నుంచి వచ్చిన వారి కోసం 'మోదీ ఎయిర్‌వేస్' పేరుతో ఏర్పాటు చేసిన విమాన ప్రయాణాలు కూడా వాలంటీర్ల ఆధ్వర్యంలో, ప్రయాణికులు సొంత ఖర్చులతో చేసుకున్నవే" అని వారు స్పష్టం చేశారు. వృత్తి నిపుణులు, కుటుంబాలు, విద్యార్థులు, వృద్ధులు ఎంతో ఆసక్తితో, సొంత డబ్బు, సమయాన్ని వెచ్చించి ఈ చారిత్రక కార్యక్రమంలో పాలుపంచుకున్నారని నిర్వాహకులు వివరించారు. "ప్రధాని మోదీని విమర్శించే హక్కు కాంగ్రెస్ పార్టీకి ఉంది. కానీ, ఆ విమర్శల కోసం వేలాది మంది ప్రవాస భారతీయుల స్వాతంత్ర్యాన్ని, ఆత్మగౌరవాన్ని కించపరచడం సరికాదు. ప్రవాస భారతీయులు రాజకీయ పార్టీల చేతిలో కీలుబొమ్మలు కాదు. వారు తమ వారసత్వాన్ని జరుపుకోవడానికి, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన నాయకుడికి స్వాగతం పలకడానికి ఎవరి అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదు" అని లేఖలో పేర్కొన్నారు. తమ ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని అంగీకరించి, వాటిని వెనక్కి తీసుకుని, క్షమాపణ చెప్పాలని నిర్వాహకులు డిమాండ్ చేశారు. "దేశీయ రాజకీయాల్లో ప్రవాస భారతీయులను అనవసరంగా లాగవద్దు. మీ ఆరోపణలు వేలాది మంది వాలంటీర్ల శ్రమను, సొంత ఖర్చులతో వచ్చిన ప్రతి కుటుంబాన్ని, సెలవు పెట్టి మరీ వచ్చిన ప్రతి ఉద్యోగిని అవమానించేలా ఉన్నాయి. ఈ తప్పుడు ఆరోపణలను సరిదిద్దుకుని, మా సమాజానికి క్షమాపణ చెబుతారని ఆశిస్తున్నాం" అని వారు లేఖలో రాసుకొచ్చారు.

# భారత్ చుట్టూ విదేశీ నిఘా?

**మొదటిపేజీ తరువాయి -**

భారత్‌తో పాటు దక్షిణాసియా ప్రాంతంలో విదేశీ పౌరులకు సంబంధించిన వరుస ఘటనలు భద్రతా వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఇటీవల అమెరికా, ఉక్రెయిన్‌కు చెందిన వ్యక్తుల అరెస్టులు, బంగ్లాదేశ్‌లో అమెరికా ప్రత్యేక దళాల అధికారి అనుమానాస్పద మృతి వంటి పరిణామాలు ప్రాంతీయ భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. అయితే ఈ ఘటనల మధ్య ప్రత్యక్ష సంబంధం ఉందని ఇప్పటివరకు ఏ అధికారిక సంస్థ కూడా నిర్ధారించలేదు.

### నేపాల్ సరిహద్దులో అమెరికా పౌరుడు

ఈ నెల ఉత్తరప్రదేశ్‌లోని సోనౌలి సరిహద్దు వద్ద ఎలాంటి పత్రాలు లేకుండా నేపాల్‌లోకి వెళ్లేందుకు యత్నించిన అమెరికా పౌరుడు జోర్డాన్ బ్రౌన్‌ను సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బీ) అదుపులోకి తీసుకుంది. తాను గతంలో అమెరికా నేవీ, స్పెషల్ ఫోర్సెస్‌లో పనిచేశానని అతడు చెబుతున్నాడు. కానీ, దానికి సంబంధించిన ఆధారాలు చూపలేకపోయాడు. అతడి నుంచి నగదు, మొబైల్ ఫోన్లు తదితర వస్తువులను స్వాధీనం చేసుకుని అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

### వాన్‌డైక్ కేసు మరో చర్చ

ఈ ఏడాది మార్చిలో అమెరికా పౌరుడు మాథ్యూ ఆరోన్ వాన్‌డైక్‌తో పాటు ఆరుగురు ఉక్రెయిన్ పౌరులను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అరెస్టు చేసింది. వీరు భారత్‌ను మధ్యేమార్గంగా ఉపయోగించుకుంటూ మయన్మార్‌లోని స్థానిక సాయుధ వర్గాలకు డ్రోన్లు, సైనిక శిక్షణ అందించినట్లు దర్యాప్తు సంస్థలు ఆరోపిస్తున్నాయి. స్వాధీనం చేసుకున్న పరికరాల్లో డ్రోన్ శిక్షణకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు లభించినట్లు సమాచారం. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోంది.

### నిపుణుల హెచ్చరిక ఇదే

ఈ ఘటనలు పరస్పరం సంబంధం ఉన్నాయని చెప్పేందుకు ప్రస్తుతం అధికారిక ఆధారాలు లేవు. కానీ, ఇలాంటి పరిణామాలు సరిహద్దు భద్రత, నిఘా వ్యవస్థలు, దేశాల మధ్య ఇంటెలిజెన్స్ సమాచార మార్పిడిని మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తున్నాయని భద్రతా నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అలాగే ఇలాంటి ఘటనలపై పారదర్శక దర్యాప్తు జరగడం కూడా కీలకమని సూచిస్తున్నారు.

# అపార్ట్‌మెంట్ ధర రూ.2.5 కోట్లు , బాల్కనీ దృశ్యం 'ధోబీ ఘాట్'లా ఉందని విమర్శలు !

**ముంబై లగ్జరీ అపార్ట్‌మెంట్‌లో బట్టల ఆరవేతపై దుమారం**

**కోట్లు పెట్టి కొన్నా చావిడిలా ఉందంటూ నెటిజన్ల విమర్శలు**

**సోషల్ మీడియాలో ఫొటో వైరల్ కావడంతో రెండు వర్గాలుగా చీలిన నెటిజన్లు**

**ఇది సాధారణమేనని, ఎండకు ఆరేయడమే మంచిదని మరికొందరి వాదన**



ముంబైలో నూతనంగా నిర్మించిన ఒక లగ్జరీ అపార్ట్‌మెంట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. రూ. 1.5 కోట్ల నుంచి రూ. 2.5 కోట్ల వరకు విలువ చేసే ఈ ఫ్లాట్ల బాల్కనీలలో నివాసితులు బట్టలు ఆరవేయడం ఈ వివాదానికి ప్రధాన కారణమైంది. బాల్కనీల నుండి వేలాడుతున్న బట్టల ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో, కొందరు దీనిని ముంబైలోని ప్రసిద్ధ 'ధోబీఘాట్'తో మరియు పాతకాలపు 'చావిడి' (సామూహిక నివాస గృహాలు) సంస్కృతితో పోలుస్తూ విమర్శిస్తున్నారు. జులై 12న 'ఏ=శ్రీఃఎయాటవీబఎమ్రిఅ' అనే 'ఎక్స్' వేదికగా షేర్ చేసిన ఒక ఫొటోతో ఈ వివాదం మొదలైంది. "కోట్లు వెచ్చించి కొనుగోలు చేసిన అపార్ట్‌మెంట్‌కు ఇలా చావిడి రూపును తీసుకువచ్చారు" అని సదరు పోస్ట్‌లో వ్యాఖ్యానించారు. భవనం యొక్క బాహ్య సౌందర్యం దెబ్బతినకుండా ఉండేందుకు, బిల్డర్లు ప్రతి అంతస్తులో బట్టలు ఆరవేసుకోవడానికి ప్రత్యేక స్థలాన్ని ఎందుకు కేటాయించలేదని ఆ యూజర్ ప్రశ్నించారు. ఈ పోస్ట్ స్వల్ప కాలంలోనే వైరల్ కావడంతో నెటిజన్లు రెండు వర్గాలుగా విడిపోయారు. అత్యంత ఖరీదైన ఫ్లాట్లలో ఇలా బట్టలు ఆరవేయడం భవనం శోభను తగ్గిస్తుందని కొందరు అభిప్రాయపడగా, మరికొందరు మాత్రం ఈ చర్యను సమర్థించారు. ముంబైలోని తేమతో కూడిన వాతావరణంలో బట్టలను ఎండలో ఆరవేయడమే అత్యుత్తమమని, ఇది సహజమైన మరియు పర్యావరణ అనుకూలమైన పద్ధతి అని పేర్కొన్నారు. స్పెయిన్, ఇటలీ వంటి యూరప్ దేశాల్లోనూ ఇది సర్వసాధారణమని గుర్తుచేశారు. కాగా, కొన్ని ఫ్లాట్లలో బాల్కనీలు చాలా ఇరుకుగా ఉండటం, ఇప్పటికే అక్కడ ఏసీ యూనిట్లు అమర్చడం వల్ల బట్టలు ఆరవేసేందుకు మరో మార్గం లేదని మరికొందరు వాపోయారు.

# డోన్ లో ఉచిత క్యాన్సర్ పరీక్షల శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కోట్ల







డోన్ టౌన్, జూలై 14,(సీమ కిరణం న్యూస్): డోన్ మున్సిపల్ క్లబ్ హౌస్‌లో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో, ఇండో అమెరికన్ రాయలసీమ ఫౌండేషన్ సహకారంతో ఉచిత క్యాన్సర్ పరీక్షల శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తిస్తే పూర్తిస్థాయిలో చికిత్స అందించే అవకాశం ఉంటుందని అన్నారు. ప్రజలు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. శిబిరంలో నిపుణులైన వైద్యులు పాల్గొని క్యాన్సర్ సంబంధిత పరీక్షలు నిర్వహించడంతో పాటు, వ్యాధి నివారణ, ముందస్తు జాగ్రత్తలు, చికిత్సా విధానాలపై అవగాహన కల్పించారు. స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య సేవలను వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైద్యులు, ఇండో అమెరికన్ రాయలసీమ ఫౌండేషన్ ప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# భారత వైమానిక దళంలో ఎయిర్‌మెన్ (మెడికల్ అసిస్టెంట్) మరియు అగ్నివీర్ వాయు పోస్టుల భర్తీ: జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

**అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు గడువు ముగిసే లోపు దరఖాస్తు చేసుకుని సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.**

కర్నూలు, (సీమ కిరణం న్యూస్):జూలై 14: దేశ సేవ చేయాలనే బలమైన సంకల్పం ఉన్న నిరుద్యోగ యువతకు భారత వైమానిక దళం (IAF) లో చేరేందుకు ఒక సువర్ణావకాశం లభించిందని కర్నూలు జిల్లా కలెక్టర్ తెలిపారు. సికింద్రాబాద్, బోయిన్‌పల్లిలోని 12వ ఎయిర్‌మెన్ సెలక్షన్ సెంటర్ రిక్రూటింగ్ అధికారి గ్రూప్ కెప్టెన్ జి. శ్రీనివాస ప్రసాద్ నుంచి అందిన అధికారిక ఉత్తర్వుల ప్రకారం, వైమానిక దళంలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి వెల్లడించారు. ఈ ప్రత్యేక రిక్రూట్‌మెంట్ ద్వారా వైమానిక దళంలో శాశ్వత క్యాడర్ కింద ఎయిర్‌మెన్ - మెడికల్ అసిస్టెంట్ పోస్టులను మరియు అగ్నిపథ్ పథకం కింద అగ్నివీర్ వాయు (Agniveervayu - Combatan) పోస్టులను భర్తీ చేయనున్నారని తెలియజేశారు. అగ్నిపథ్ నిబంధనల ప్రకారం అగ్నివీర్ వాయుగా ఎంపికైన అభ్యర్థులు 4 సంవత్సరాల పాటు సేవలు అందించవలసి ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం వారి ప్రతిభ మరియు శారీరక సామర్థ్యం ఆధారంగా గరిష్టంగా 25 శాతం మంది అభ్యర్థులను శాశ్వత క్యాడర్‌లోకి నియమించడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేయదలిచిన అర్హులైన అభ్యర్థులు కేవలం అధికారిక వెబ్‌పోర్టల్ https://iafrecruitment.edcil.co.in ద్వారా మాత్రమే తమ పేర్లను ఆన్‌లైన్ లో నమోదు చేసుకోవాల్సి ఉంటుందని స్పష్టీకరించారు. ఈ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ 06 జూలై, 2026 రోజున ఉదయం 11:00 గంటలకు ప్రారంభమవుతుందని, దరఖాస్తులను సమర్పించడానికి 26 జూలై, 2026 రాత్రి 11:00 గంటల వరకు ఆఖరి గడువుగా నిర్ణయించారని పేర్కొన్నారు.




**అభ్యర్థులకు ముఖ్య గమనికలు ఒ నిబంధనలు:**

అడ్మిట్ కార్డ్ తప్పనిసరి: వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసి, అధికారికంగా ప్రొవిజనల్ అడ్మిట్ కార్డ్ (**Provisional Admit Card**) పొందిన అభ్యర్థులను మాత్రమే సెలక్షన్ టెస్ట్‌కు అనుమతిస్తారని తెలిపారు. ఈ ఉద్యోగ నియామకాలకు సంబంధించి ఎటువంటి దళారులను నమ్మవద్దని, కేవలం రిక్రూట్‌మెంట్ పరీక్షల ప్రతిభ ఆధారంగానే ఎంపికలు జరుగుతాయని స్పష్టం చేశారు. కర్నూలు జిల్లాలోని గ్రామీణ మరియు పట్టణ ప్రాంత నిరుద్యోగ యువతకు ఈ రిక్రూట్‌మెంట్ ద్వారా గరిష్ఠ ప్రయోజనం చేకూరాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు గడువు ముగిసే లోపు (26 జూలై, 2026) దరఖాస్తు చేసుకుని భారత వైమానిక దళంలో చేరే ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

**అదనపు సహాయం కొరకు సంప్రదించండి:**

చిరునామా: 12 ఎయిర్‌మెన్ సెలక్షన్ సెంటర్, భారత వైమానిక దళం, బోయిన్‌పల్లి, సికింద్రాబాద్ - 500011.

**ఫోన్ నంబర్లు:** 044-27758212, మొబైల్: 8449969279

ఈమెయిల్: defender-rollers@gov.in

# ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియను మధ్యాహ్నం లోపు పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**

కర్నూలు,(సీమ కిరణం న్యూస్):జూలై 14: జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసి, పెండింగ్ అంశాలను ఈరోజు లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి సంబంధిత ఎన్నికల అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎస్ఐఆర్ (ౠ×=) ప్రక్రియలో భాగంగా చేపడుతున్న ఈఎఫ్ (ఋఖీ) డిజిటైజేషన్, అన్‌కలెక్టబుల్ డేటా ఎంట్రీలు, ఏఎస్‌డీడీ (ౠూణణ) నమోదు తదితర పనుల పురోగతిపై కలెక్టర్ సంబంధిత ఈఆర్ఓ, ఏఈఆర్ఓ లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏఎస్‌డీడీ (ౠూణ) జాబితాకు సంబంధించి ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి బీఎల్‌వోలు (దీూలు) క్షేత్రస్థాయిలో ధృవీకరించి మాత్రమే చర్యలు చేపట్టాలన్నారు. పెండింగ్ పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని కలెక్టర్ ఈఆర్‌వోలు (ఋ=ాం), ఏఈఆర్‌వోలు (ౠఋ=ాం) లకు స్పష్టం చేశారు. కర్నూలు (99.39 శాతం), పాణ్యం (97.22 శాతం) నియోజకవర్గాల పెండింగ్ పనులను మధ్యాహ్నం లోపు పూర్తిచేయాలన్నారు. అదే విధంగా ఎమ్మిగనూరు (99.55 శాతం), మంత్రాలయం (99.37 శాతం), ఆదోని (99.47 శాతం), ఆలూరు (99.97 శాతం) నియోజకవర్గాల అధికారులు కూడా పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. పత్తికొండ, కోడుమూరు మినహా మిగతా అన్ని నియోజకవర్గాలు నిర్ణీత గడువులో పూర్తిస్థాయికి చేరుకోవాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా అందిన ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్‌ను కూడా తక్షణమే పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఆన్లైన్ లో వచ్చిన ఎన్యూమరేషన్ ఫార్మ్ ప్రస్తుతం పాణ్యంలో 48, కర్నూలులో 13, ఎమ్మిగనూరులో 6, ఆదోనిలో 4, కోడుమూరు మరియు మంత్రాలయంలో ఒక్కో ఫారం చొప్పున పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొంటూ, ఇవన్నీ మధ్యాహ్నం లోపు పూర్తిచేయాలని ఆదేశించారు. బుక్ ఏ కాల్ కు సంబంధించి పెండింగ్ రిక్వెస్ట్ లు 184 ఉంటే, 48 గంటల కంటే ఎక్కువ సమయం నుండి పెండింగ్ లో ఉన్న రిక్వెస్ట్స్ 26 ఉన్నాయన్నారు. వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దీూా మినిట్స్ ను 2203 దీూా లలో కేవలం 241 మంది దీూా లు మాత్రమే ఆన్లైన్ లో అప్లోడ్ చేశారన్నారు. మిగిలిన దీూా లు కూడా వెంటనే అప్లోడ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.. బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి చేసిన తనిఖీలకు ఆధారంగా, పొరుగువారి సంతకాలతో కూడిన పంచనామా ప్రొఫార్మాలను సిద్ధం చేసి భద్రపరచాలని కలెక్టర్ సూచించారు. దీంతో బీఎల్ఓలు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించినట్లు స్పష్టమైన ఆధారాలు ఉంటాయని కలెక్టర్ తెలిపారు. జూలై 21న ముసాయిదా (డ్రాఫ్ట్) ఓటరు జాబితా ప్రచురించిన అనంతరం, ఓటరు జాబితాలో పేరు లేకపోవడం, వివరాల్లో పొరపాట్లు ఉండటం లేదా ఇతర అభ్యంతరాలు ఉన్నట్లయితే సంబంధిత క్లెయిమ్‌లు, అభ్యంతరాలను నిర్దేశిత విధానంలో సమర్పించుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. టెలి కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, కర్నూలు మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, ఆదోని ఈఆర్ఓ మధుసూదన్ రెడ్డి, పత్తికొండ ఆర్డీఓ ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, తదితరులు పాల్గొన్నారు..

# ప్రజల సానుకూల దృక్పథం ( పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్ )80% కు రావాలి

**గ్యాస్ బాయ్స్ అదనపు డబ్బులు తీసుకుంటే ఏజెన్సీ పై కఠిన చర్యలు**

**జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి**

**ఏజెన్సీలు గ్యాస్ బాయ్స్ కి బ్యాంకు,డిజిటల్ పేమెంట్ ల ద్వారా జీతాలు చెల్లించాలి**

**ఇకపై ఎటువంటి పొరపాట్లు జరిగిన ఉపేక్షించేది లేదు**

**జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్**

కర్నూలు (సీమ కిరణం న్యూసజూలై 14 : గ్యాస్ ఏజెన్సీలు ప్రజల సానుకూల దృక్పథం ( పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్ ) లో మంచి గుర్తింపు సాధించి జిల్లా ను మంచి స్థానం లో ఉండేలాగా చర్యలు తీసుకోవాలి అని పౌరసరఫరాల శాఖ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి.పేర్కొన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లాలోని గ్యాస్ ఏజెన్సీల తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం దీపం-2 పథకం ద్వారా ప్రజల కు ఉచితంగా గ్యాస్ సిలిండర్ల సరఫరా చేస్తూ ఉన్నప్పటికీ ప్రజల నుండి సానుకూల దృక్పథం ( పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్ ) రాకపోవటానికి కారణం గ్యాస్ ఏజెన్సీలు మరియు డెలివరీ బాయ్స్ కారణమని తెలిపారు. ఇప్పటికే చాలాసార్లు ఈ విషయంపై సూచనలు ఇవ్వడం , శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. డెలివరీ బాయ్స్ అదనపు సొమ్ము వసూలుకు పాల్పడం వలన ప్రజల సానుకూల దృక్పథం సూచిక లో వెనుకబడి ఉన్నామని ఈ విషయంలో ఏజెన్సీలు కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఐఓసీ (ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ) సంస్థ ఇప్పటికే మూడు ఏజెన్సీ లపై చర్యలు తీసుకున్నదని తెలిపారు. కొన్ని ఏజెన్సీలపై 2 లక్షల రూపాయల నుండి 8 లక్షల రూపాయల వరకు పెనాల్టీలు కూడా విధించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. పెద్ద కడుబూరు చెందిన మాధురి గ్యాస్ ఏజెన్సీ కి ఎన్నిసార్లు హెచ్చరించిన సరైన చర్యలు తీసుకొననందున ఆ ఏజెన్సీ పై చర్యల లో భాగంగా వారి కస్టమర్లను సమీపంలోని గ్యాస్ ఏజెన్సీకి ట్యాగ్ చేయడం జరుగుతుందని తెలిపారు. కావున గ్యాస్ ఏజెన్సీలు చిత్తశుద్ధితో ప్రజలకు గ్యాస్ సరఫరా చేసి ప్రజా సానుకూలత పెంచే దిశగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మాట్లాడుతూ... గ్యాస్ డెలివరీ బాయ్స్ లు ప్రజల కు సిలిండర్ ఇచ్చాక అదనపు మొత్తం తీసుకొనరాదు.ఏజెన్సీ లు డెలివరీ బాయ్స్ కు జీతం బ్యాంక్ లేదా డిజిటల్ పేమెంట్స్ ద్వారా మాత్రమే చెల్లించాలి,ఈ విధంగా చేయక పోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా గ్యాస్ ఏజెన్సీ లు శివ బాలాజీ సి-



బెలగల్ , మాధురి గ్యాస్ ఏజెన్సీ పెద్దకడబూరు , విజయ గ్యాస్ కర్నూల్ , సూర్య గ్యాస్ ఏజెన్సీ , విష్ణుప్రియ మొదలగు గ్యాస్ ఏజెన్సీలను సమీక్షిస్తూ ఎంతమంది గ్యాస్ బాయిస్ ఉన్నారు , ఎన్ని వాహనాలు ఉన్నాయి వారికి జీతం ఏ విధంగా ఇస్తున్నారు , ఎంతమందిని కంప్లైంట్స్ పై తీసివేశారు ,అన్న విషయాలను అడిగి తెలుసుకుని ఎటువంటి పరిస్థితుల్లోనూ గ్యాస్ బాయ్స్ అదనపు సొమ్ము వసూలు చేయరాదని మరియు గ్యాస్ బాయ్స్ కు జీతం ఆన్లైన్ ద్వారానే చెల్లించాలని ఆదేశించారు. గ్యాస్ బాయ్స్ కు అందజేసే జీతాల వివరాలు మరియు సరఫరా కు వినియోగించే వాహనాల వివరాలు డిఎస్ఓ కార్యాలయానికి అందజేయాలని ఏజెన్సీ లను ఆదేశించారు. ఇకపై గ్యాస్ ఏజెన్సీలు ఎటువంటి పొరపాట్లు చేసిన ఉపేక్షించేది లేదని జాయింట్ కలెక్టర్ తెలియజేశారు. ఈ సందర్భంగా సివిల్ సప్లై డిప్యూటీ తాసిల్దార్ ల పనితీరును సమీక్షించారు. ప్రతి గ్యాస్ ఏజెన్సీ కి వెళ్లి ఈ విషయాల పై తనిఖీలు జరిపి నివేదికలు అందజేయాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. జిల్లా పౌర సరఫరా అధికారి రాజా రఘువీర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలోని 41 ఏజెన్సీల పనితీరును , ప్రజా సానుకూలత దృక్పథం వివరాలు సమావేశంలో వివరించారు. ఈ సమావేశం లో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రాజా రఘు వీర్ , ఏడి మార్కెటింగ్ నారాయణ మూర్తి , సివిల్ సప్లై డిప్యూటీ తాహసీల్దారులు , గ్యాస్ కంపెనీ ల ప్రతినిధులు మరియు జిల్లా గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఐదుగురికి జైలు



డోన్ టౌన్, జూలై 14(సీమ కిరణం న్యూస్): డోన్ మెజిస్ట్రేట్ ఎస్. నూరుల్లా కోర్టులో విచారణకు వచ్చిన డోన్ టౌన్ పోలీస్ స్టేషన్ కు సంబంధించిన ఐదుగు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో రెస్పాండెన్స్ అయిన గోనెల మాదిగ ప్రకాశం, (53),ఎస్/ఆఫ్ జి .మారన్న వైయస్ నగర్ ,డోన్ టౌన్ అనునతనికి మూడు రోజులు జైలు శిక్ష . కుమ్మరి ఆనంద్ (36) ఎస్/ఆఫ్ కె. వెంకటపతి, పాతపేట డోన్ టౌన్ అనునతనికి మూడు రోజులు జైల్ శిక్ష విధించారు. బోయ ఆనంద్ ,(26) ఎస్/ఆఫ్ బి. నాయుడు , కొండపేట, డోన్ టౌన్ అనున తనికి మూడు రోజులు జైలు శిక్ష . షేక్ .రఫీ(28)ఎస్/ఆఫ్ ఎస్ . కాశీం ,ఇంద్రా నగర్ , డోన్ టౌన్, అనునతనికి రెండు రోజులు జైలు శిక్ష. షేక్ .మహబూబ్ బాషా, (49) ఆఫ్ ఎస్, ఎస్. హుస్సేన్ మియా శ్రీ రామానగర్ డోన్ టౌన్,అనునతనికి రూ.10000/-జరిమానా విధించారు.మద్యం సేవించి వాహనాలు నడపటం ఒక తీవ్రమైన నేరం. ఇలాంటి చర్యలకు డ్రైవరు ప్రాణాలతో పాటు అమాయక ప్రజలు ప్రాణాలను కూడా ప్రమాదంలోనికి నేడతాయి. ఎవరు మద్యం సేవించి వాహనం నడుపుతున్నట్లు గుర్తించిన వారిపై తక్షణమే కేసులు నమోదు చేసి, కోర్టు ముందు హాజరపరుస్తారు. మద్యం తాగి వాహనం నడపడం వలన భారీ జరిమానాలు, జైలు శిక్ష తప్పవు. రోడ్డు ప్రమాదాలు పెరగకుండా ఉండాలంటే ప్రజలందరూ చట్టాన్ని కచ్చితంగా పాటించాలి. ఎవరైనా మద్యం సేవించి వాహనం నడిపితే వారి పై డోన్ టౌన్ పోలీసులు కఠిన చర్యలు తీసుకోవడం ఎలాంటి వెనుకడుగు వేయరు. ప్రజలందరూ తమ ప్రాణాల రక్షణ కోసం ఇతరుల ప్రాణాల రక్షణ కోసం మద్యం సేవించి వాహనాలు నడపరాదని గట్టిగా హెచ్చరిస్తున్నాము.

# వర్షం కోసం పూజలు



ప్యాపిలి, జూలై 14 (సీమ కిరణం న్యూస్) : పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఉన్న బొడ్రాళ్ల కు రైతులు 11 బిందెల చొప్పున జలాభిషేకం చేశారు. అనంతరం బందేనవాజ్ పీర్ల దర్గా లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ గ్రామస్తులు సంప్రదాయ ఆచారంలో భాగంగా గ్రామంలో మంచి వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, రైతుల కష్టాలు తీరాలని ప్రార్థనలు నిర్వహించారు .ఇటీవల ఆశించిన స్థాయిలో వర్షపాతం లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామ పెద్దల సూచనల మేరకు యువకులు, మహిళలు కలిసి బొడ్రాయిలకు జలాభిషేకం చేసి గ్రామదేవతలను ప్రార్థించారు. త్వరలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు పుష్కలంగా పండాలని గ్రామస్తులు ఆకాంక్ష వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎరువుల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు

## ఏడీఏ సునీత





ప్యాపిలి, జూలై 14 సీమ కిరణం న్యూస్) : రైతులకు నాణ్యమైన ఎరువులు అందేలా చర్యలు చేపడుతూ వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం ఎరువుల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ (ఏడీఏ) సునీత, వ్యవసాయ అధికారి రాజేష్ పట్టణంలోని పలు ఎరువుల విక్రయ కేంద్రాలను తనిఖీ చేశారు. దుకాణాల్లో యూరియా, డీఏపీ, ఇతర ఎరువుల నిల్వలు, విక్రయాల రికార్డులు, ధరల జాబితా, లైసెన్సులు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు.రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు విక్రయించాలని, ఎలాంటి అక్రమ నిల్వలు, అధిక ధరలకు విక్రయాలు, బిల్లులు లేకుండా అమ్మకాలు జరపరాదని డీలర్లకు అధికారులు సూచించారు. ప్రతి విక్రయాన్ని తప్పనిసరిగా నమోదు చేసి రైతులకు బిల్లు ఇవ్వాలని ఆదేశించారు.నకిలీ ఎరువులు విక్రయించడం లేదా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. రైతులు కూడా ఎరువులు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని, ఏవైనా అక్రమాలు గమనిస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

# పొలం పిలుస్తోంది కార్యక్రమం






ప్యాపిలి, జూలై 14 ( సీమ కిరణం న్యూస్) : స్థానిక రైతు సేవా కేంద్రం (ఆర్ఎస్‌కె)లో రైతులకు వ్యవసాయంపై అవగాహన కల్పించేందుకు మంగళవారం' పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ ఏడిఏ సునీత , ఏవో రాజేష్, ఉద్యానవన శాఖ అధికారిని కళ్యాణి రైతులకు పలు కీలక అంశాలపై వివరించారు.ముఖ్యంగా ఈ ఏడాది వర్షపాత పరిస్థితులు, ప్యాపిలి మండలంలోని మెట్ట ప్రాంతాలపై ఎల్ నినో ప్రభావం వల్ల ఎదురయ్యే సవాళ్లు, వాటిని అధిగమించే సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. అలాగే ఏపీఏఐఎంఎస్ యాప్ ద్వారా యూరియా, డీఏపీ ఎరువుల పారదర్శక పంపిణీ విధానాన్ని వివరించారు.అదేవిధంగా రైతులు తప్పనిసరిగా పంటల బీమా పథకంలో నమోదు చేసుకోవాలని, ఇ-క్రాప్ బుకింగ్ సక్రమంగా చేయించడం ద్వారా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందవచ్చని సూచించారు. రైతు నమోదు ప్రాధాన్యతను వివరించి, ప్రతి రైతు తన వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు.మెట్ట ప్రాంతాల్లో వర్షాధార పరిస్థితులకు అనుగుణంగా సాగు చేయాల్సిన పంటలు, నీటి సంరక్షణ చర్యలు, ఆధునిక సాగు విధానాలపై కూడా రైతులకు సూచనలు అందించారు. రైతులు అడిగిన సందేహాలకు అధికారులు సమాధానాలు ఇచ్చి, ప్రభుత్వ వ్యవసాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

# భవ్య పథకం వర్తింపుకు తగిన చర్యలు తీసుకోవాలి

## జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి

కర్నూలు, ( సీమ కిరణం న్యూస్) జూలై 14: భవ్య పథకం వర్తింపుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో ఏపీఐఐసీ కి సంబంధించి భవ్య పథకం కింద భూసేకరణ, గుట్టపాడు వద్ద ఎస్ ఎస్ ట్యాంక్ నిర్మాణం అంశాలపై ఇరిగేషన్, ఏపీఐఐసీ అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న భవ్య పారిశ్రామిక పథకం వర్తించేలా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి లొద్దిపల్లి,మీదివేముల వద్ద భూసేకరణ గురించి జాయింట్ కలెక్టర్, ఆర్డీవో, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్, ఓర్వకల్లు తహసీల్దార్ లతో చర్చించారు. ఇందుకు సంబంధించిన చర్యలు వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అదే విధంగా గుట్టపాడు వద్ద ఎస్ఎస్ ట్యాంక్ నిర్మాణం గురించి ఇరిగేషన్, ఏపీఐఐసీ అధికారులతో చర్చించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మధుసూదన్ రెడ్డి, నంద్యాల ఇరిగేషన్ ఎస్ ఈ శుభకుమార్, డిఈ కిష్టన్న, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## సెబీ చీఫ్ బుచ్ రాజీనామా చేయాలి ఉద్యోగుల నిరసన

### సెబీ ప్రధాన కార్యాలయంలో ఉద్యోగుల నిరసనలు



క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ ప్రధాన కార్యాలయంలో గురువారం ఉద్యోగులు నిరసనల బాట పట్టారు. అవినీతి ఆరోపణల్ని ఎదుర్కొంటున్న సెబీ చీఫ్ మాధబీ పురి బుచ్ రాజీనామాను కోరుతూ ఇక్కడి బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లోగల హెడ్ ఆఫీస్ ఎదుట పెద్ద ఎత్తున మౌన ప్రదర్శన ఇచ్చారు. బుచ్‌తోపాటు ఈ వ్యవహారంలో ఉన్న ఇతర అధికారుల కార్యాలయాల ముందూ నిరసనల్ని వ్యక్తం చేశారు. ఇందులో 200 మందికిపైగా పాల్గొన్నట్టు అంచనా.వీరిలో ఎవరూ మీడియా ముందు మాట్లాడలేదు. కానీ బుధవారం సెబీ విడుదల చేసి పత్రికా ప్రకటనను ఉపసంహరించుకోవాలని, సెబీ చీఫ్ రాజీనామా చేయాలని నినదించారు. సుమారు గంటన్నరపాటు ఈ నిరసనలు కొనసాగాయి. నిజానికి గతంలోనూ ఇదే తరహాలో సెబీ ప్రధాన కేంద్రం వద్ద ఆందోళనలు జరిగాయి. అయితే వాటికి, ఉద్యోగులకు ఎలాంటి సంబంధం లేదని అక్కడి ఉన్నతాధికారులు కొట్టిపారేశారు. ఆ నేపథ్యంలో తాజా ఉద్యోగుల నిరసన మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది.అదానీ గ్రూప్ వ్యవహారంలో బుచ్ పాత్ర కూడా ఉందని, విదేశాల్లోని కొన్ని సంస్థల్లో ఆమెకు, ఆమె భర్తకు వాటాలున్నాయని అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ బయటపెట్టింది. అప్పట్నుంచి బుచ్ వార్తల్లో నిలుస్తున్నారు. ఈ క్రమంలోనే ఆగస్టు 6న కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు సెబీలో దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయని, ఉన్నతాధికారుల తీరు అస్సలు బాగాలేదంటూ దాదాపు 500 మంది ఉద్యోగులు లేఖ రాశారు. దీనిపై మీడియాలో వార్తలు రావడంతో సెబీ ఓ పత్రికా ప్రకటనను విడుదల చేస్తూ అంతా ఉట్టిదేనంటూ కొట్టిపారేసింది. ఇది ఉద్యోగులకు మరింత ఆగ్రహాన్ని తెచ్చిపెట్టింది.

**సహారా రూ.1,000 కోట్లు కట్టాలి**

సహారా గ్రూప్.. ఓ ప్రత్యేక ఎస్క్రో ఖాతాలో 15 రోజుల్లోగా రూ.1,000 కోట్లను డిపాజిట్ చేయాలని సుప్రీం కోర్టు గురువారం ఆదేశించింది. అలాగే రూ.10,000 కోట్ల డిపాజిట్ కోసం ముంబైలోని వార్సోవా వద్దనున్న భూమి అభివృద్ధికి జాయింట్ వెంచర్ ఏర్పాటుకు అనుమతించింది.

## స్వచ్ఛభారత్‌తో మెరుగైన ప్రజారోగ్యం


**శిశు మరణాలు భారీగా తగ్గాయి: మోదీ**




స్వచ్ఛభారత్ మిషన్‌తో పరిశుద్ధ భారత్ కల సాకారమవుతోందని.. ప్రజారోగ్యం మెరుగవుతోందని ప్ర?ధాని నరేంద్ర మోదీ అన్నారు. కార్యక్రమంలో భాగంగా మరుగుదొడ్లు నిర్మించడంతో నవజాత శిశు, పిల్లల మరణాలు భారీగా తగ్గాయని చెప్పారు. ఈ విషయాన్ని తాజాగా ఓ అధ్యయనం వెల్లడించిందని.. తనకు ఎంతో సంతోషంగా ఉందని వ్యాఖ్యానించారు. 'ప్రజారోగ్యాన్ని కాపాడటంలో స్వచ్ఛ, సురక్షితమైన పారిశుధ్యమే కీలకం. భారత్ ఇందులో ముందున్నందుకు సంతోషంగా ఉంది' అని ఎక్స్‌లో పేర్కొన్నారు.స్వచ్ఛభారత్ కారణంగా భారత్‌లో శిశు మరణాలు తగ్గాయంటూ 'నేచర్' అనే బ్రిటిష్ జర్నల్ ప్రచురించిన కథనాన్ని ఆయన పంచుకున్నారు. అమెరికాలోని ఇంటర్నేషనల్ ఫుడ్ పాలసీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ పరిశోధకులు ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. 2014లో చేపట్టిన స్వచ్ఛభారత్ కార్యక్రమం ద్వారా దేశమంతటా మరుగుదొడ్ల నిర్మాణం అనూహ్యంగా పెరిగిందని.. దీంతో ఏటా 60 వేల నుంచి 70 వేల నవజాత శిశు, పిల్లల మరణాలు తగ్గాయని వారు వెల్లడించారు. మెరుగైన పారిశుధ్యంతో 5-30 శాతం వరకు పిల్లల మరణాలు రేటును తగ్గించవచ్చని అభిప్రాయపడ్డారు.

## అఘాడీలో లుకలుకలు

**రాహుల్ సభకు ఉద్ధవ్ డుమ్మా**



కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మహారాష్ట్ర పర్యటనలో భాగంగా నిర్వహించిన కార్యక్రమాలకు శివసేన(యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ థాకరే డుమ్మా కొట్టారు. సాంగ్లిలో రాహుల్ నిర్వహించిన బహిరంగ సభకు కూడా ఉద్ధవ్ గైర్హాజరయ్యారు. ఒకరోజు పర్యటనలో భాగంగా రాహుల్ ఇటీవల కన్నుమూసిన నాందేడ్ ఎంపీ వసంత్ చవాన్ కుటుంబ సభ్యులను తొలుత పరామర్శించారు. ఆ తర్వాత సాంగ్లిలో మాజీ మంత్రి పతంగ్ రావ్ కదం విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం సాంగ్లిలో నిర్వహించిన బహిరంగ సభలో రాహుల్ ప్రసంగించారు. సభకు ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ సహా పలువురు కాంగ్రె స్ నేతలు హాజరయ్యారు.అయితే కార్యక్రమానికి హాజరుకాలేనని గతవారమే ఉద్ధవ్ చెప్పారని పతంగ్ రావ్ కదం తనయుడు, కాంగ్రెస్ ఎమ్మెల్యే విశ్వజిత్ కదం చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల వేళ జరిగిన ఈ సభకు ఉద్ధవ్‌తో పాటు ఆయన పార్టీ నేతలెవ్వరూ హాజరుకాకపోవడం చర్చనీయాంశమైంది. నవంబరు 2019 నుంచి 2022 జూన్ వరకూ శివసేన(యూబీ టీ), ఎన్సీపీ (ఎస్పీ), కాంగ్రెస్ సంయుక్తంగా మహావికాస్ అఘాడిగా ఏర్పడి మహారాష్ట్రలో కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. మరోవైపు త్వరలో మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో కూట మి తరపున సీఎం అభ్యర్థి ఎవరనేది తేల్చాలని ఉద్ధవ్ పట్టుబడుతున్న నేపథ్యంలో ఆయన గైర్హాజరు చర్చనీయాంశమైంది.

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

## 151 పాయింట్లు పతనమైన సెన్సెక్స్



దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం వరుసగా రెండోరోజు నష్టాల్లో ముగిశాయి. భారీ అమ్మకాల తర్వాత ఆసియా మార్కెట్లు గురువారం లాభాల్లో మొదలయ్యాయి. ఆ తర్వాత కొద్దిసేపటికి మార్కెట్లు ఒక్కసారిగా నష్టాల్లోకి జారుకున్నాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 82,469.79 నష్టాల్లో మొదలైంది. ఈ క్రమంలో సెన్సెక్స్ 82,617.49 పాయింట్ల గరిష్ఠానికి చేరుకోగా.. ఇంట్రాడేలో 82,130.44 పాయింట్ల కనిష్ఠానికి పతనమైంది. చివరకు 151.48 పాయింట్ల నష్టంతో 82,201.16 వద్ద ముగిసింది.నిఫ్టీ 53.60 పాయింట్ల నష్టపోయి.. 25,145.10 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో దాదాపు 2,185 షేర్లు పెరగ్గా.. మరో 1,585 షేర్లు పతనమ్యాయి. మరో 99 మాత్రం మారలేదు. నిఫ్టీలో టైటాన్ కంపెనీ, ఎల్‌టీఐఎండ్‌ట్రీ, విప్రో, బీపీసీఎల్, ఐటీసీ లాభాల్లో ముగిశాయి. కోల్ ఇండియా, బ్రిటానియా ఇండస్ట్రీస్, సిప్లా, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, రిలయన్స్ ఇండస్ట్రీస్ నష్టపోయాయి. క్యాపిటల్ గూడ్స్, పవర్, ఆయిల్, గ్యాస్, రియాల్టీలో అమ్మకాలు.. మెటల్, ఐటీ, టెలికాం మరియు మీడియాలో కొనుగోళ్లు కనిపించాయి. బీఎస్ఈ మిడ్ క్యాప్ ఇండెక్స్ 0.3 శాతం, స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.5 శాతం వృద్ధిని నమోదు చేశాయి.

## వాటాదారులకు 1:1

## బోనస్ షేర్లు ఆమోదించిన రిలయన్స్ బోర్డు




వాటాదారులకు రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) వినాయక చవితి పండుగ కానుకను అందించింది. 1:1 బోనస్ షేర్ల జారీకి ఆ సంస్థ బోర్డు గురువారం ఆమోదం తెలిపింది. ఈ మేరకు రెగ్యులేటరీ ఫైలింగ్‌లో రిలయన్స్ పేర్కొన్నది. ప్రస్తుతం షేర్‌హోల్డర్ల వద్ద ఉన్న రూ.10 విలువైన ప్రతీ ఫుల్ పెయిడ్-అప్ ఈక్విటీ షేర్‌కు సమాన విలువలో మరో ఫుల్లీ పెయిడ్-అప్ ఈక్విటీ షేర్‌ను ఉచితంగా ఇచ్చేందుకు తమ కంపెనీ బోర్డు సిఫార్సు చేసినట్టు బిలియనీర్ ముకేశ్ అంబానీ నేతృత్వంలోని ఆర్ఐఎల్ ప్రకటించింది. ప్రస్తుతం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ)లో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్ విలువ రూ.2,987.15 వద్ద ముగిసింది. బుధవారం ముగింపుతో పోల్చితే 1.41 శాతం దిగజారింది.

**ఏడేండ్ల తర్వాత..**

రిలయన్స్ ఇన్వెస్టర్లకు ఇలా 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్లు దక్కడం గడిచిన ఏడేండ్లలో ఇదే తొలిసారి. ఇంతకుముందు 2017 సెప్టెంబర్‌లో ఇలాగే 1:1 బోనస్ షేర్లను కంపెనీ ఇష్యూ చేసింది. నాడు కంపెనీ షేర్ ధర దాదాపు రూ.700లుగా ఉన్నది. అంతకుముందు 2009-10లో వాటాదారులకు 1:1 బోనస్ షేర్లు దక్కాయి. అయితే తొలి బోనస్ 1980-81లో జారీ అయ్యింది. 3:5 నిష్పత్తిలో ఇచ్చారు.ఆ తర్వాత 1983-84లో 6:10తో ప్రకటించారు. 1:1 నిష్పత్తిలో మాత్రం తొలిసారి 1997-98లో జారీ చేశారు. మొత్తంగా రిలయన్స్ ఐపీవో దగ్గర్నుంచి ఇన్వెస్టర్లకు ఇది 6వ బోనస్. ప్రస్తుతం దేశీయ అతిపెద్ద కంపెనీగా రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఉన్న విషయం తెలిసిందే.నిజానికి ఇటీవల నిర్వహించిన కంపెనీ వార్షిక సాధారణ సమావేశంలోనే ఈ 1:1 బోనస్ షేర్ల జారీ ప్రకటన అధికారికంగా వెలువడింది. అయితే తాజాగా జరిగిన బోర్డు సమావేశంలో దానికి ఆమోదముద్ర పడింది. కాగా, ఈ బోనస్ షేర్ల జారీ కోసం రికార్డు తేదీని త్వరలో ప్రకటించనున్నారు. ఇదిలావుంటే కంపెనీ ఆథరైజ్డ్ షేర్ క్యాపిటల్‌ను రూ.15,000 కోట్ల నుంచి రూ.50,000 కోట్లకు పెంచుకోవడానికి కూడా కంపెనీ బోర్డు ఈ సందర్భంగా అనుమతిచ్చింది. దీంతో షేర్‌హోల్డర్ల అనుమతిని సంస్థ కోరుతున్నది.

## విద్యుత్ సర్‌చార్జీలతో పరిశ్రమలు విలవిల..!

## ఆందోళనలో పారిశ్రామిక వర్గాలు..!

- ఒక్కో యూనిట్‌పై రూ.1.40 భారం
- బకాయిలపై 18 శాతం వడ్డీ వసూలు
- ఇలాగైతే నడపలేమంటున్న ఇండస్ట్రీ వర్గాలు





రాష్ట్రంలో విద్యుత్తు దెబ్బకు పరిశ్రమలు విలవిల్లాడుతున్నాయి. సర్‌చార్జ్‌ల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఇష్టమున్నట్లు వడ్డిస్తుండటంతో పారిశ్రామిక వర్గాలు ఆందోళన చెందుతున్నారు. ఓపెన్ యాక్సిస్ విద్యుత్తుపై అదనపు సర్‌చార్జ్ పేరుతో ఒక్కో యూనిట్‌కు రూ.1.40 వసూలు చేస్తున్నారు. ఇక బకాయిలపై కాంపౌండింగ్ ఇంట్రెస్ట్ పేరుతో 18 శాతం వడ్డీని ముక్కుపిండి వసూలు చేస్తుండటంతో పరిశ్రమవర్గాలు లబోదిబోమంటున్నాయి. పరిశ్రమలు ప్రభుత్వ సంస్థల నుంచే కాకుండా ప్రైవేటు కంపెనీల నుంచి ఓపెన్ యాక్సెస్ పద్ధతిలో విద్యుత్తు కొనుగోలు చేయడం ఆనవాయితీగా వస్తున్నది. ప్రస్తుతం ఓపెన్ యాక్సిస్ పద్ధతిపై నిషేధం ఉండగా, ఇప్పటికే ఈ విధానంలో విద్యుత్తును కొనుగోలు చేస్తున్న పరిశ్రమల నుంచి సర్‌చార్జ్‌తోపాటు స్టాండర్డ్ అడిషనల్ సర్‌చార్జ్ పేరుతో అదనంగా ఒక్కో యూనిట్‌పై రూ.1.40 చొప్పున వసూలు చేస్తున్నారు.ఇది పరిశ్రమలకు తలకుమించిన భారంగా మారింది. ఓపెన్ యాక్సెస్ విద్యుత్తు కొనుగోలుపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయాలని, అదనపు సర్‌చార్జిని ఎత్తివేయాలని పరిశ్రమవర్గాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. వివిధ కారణాలతో మూతపడిన పరిశ్రమల విద్యుత్తు బకాయిలు భారీగా పేరుకుపోయాయి. ఆ బకాయిలపై 18 శాతం వడ్డీ భారాన్ని మోపుతున్నారు. నష్టాలతో మూతపడిన చాలా పరిశ్రమలు ఇప్పుడు మళ్లీ ప్రారంభించుకునేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ ముందుగా తమ బకాయిలు తీర్చాలని విద్యుత్తు సంస్థలు పట్టుబడుతున్నాయి. వన్‌టైమ్ సెటిల్‌మెంట్ పద్ధతిని ప్రవేశపెట్టి విద్యుత్తు బకాయిలను పరిష్కరించాలని పరిశ్రమ వర్గాలు కోరుతున్నాయి.

**విద్యుదుత్పత్తికి అనుమతించండి**

ఐఎస్‌టీఎస్(ఇంటర్ స్టేట్ ట్రాన్స్‌మిషన్ సిస్టం) పథకం కింద కేంద్రం రూఫ్‌టాప్ సోలార్ ఎనర్జీకి భారీగా రాయితీలు అందిస్తున్నది. అయితే మన రాష్ట్రంలో రూఫ్‌టాప్ విద్యుత్తును ఒక మెగావాట్ సామర్థ్యం వరకు మాత్రమే అనుమతిస్తున్నారు. కాగా, దీన్ని ఐదు మెగావాట్ల సామర్థ్యానికి పెంచుకునేందుకు వీలుగా తమకు నిరభ్యంతర ధృవపత్రం(ఎన్‌ఓసీ) ఇవ్వాలని పరిశ్రమాధిపతులు కోరుతున్నారు. దీంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ఏపెన్ యాక్సిస్ గ్రీన్ పాలసీకి సంబంధించి మార్గదర్శకాలు వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తిచేస్తున్నారు.అలాగే, పరిశ్రమల్లో బాయిలర్ల ద్వారా విడుదలయ్యే వేడి వాయువుల (డబ్ల్యూహెచ్‌ఆర్‌బీ-వేస్ట్ హీట్ రికవరీ బాయిలర్స్)నుంచి విద్యుత్తు తయారుచేసుకునే అవకాశం కూడా కల్పించాలని వారు కోరుతున్నారు. ప్రస్తుతం ఈ వాయువులను చల్లార్చి గాలిలోకి వదలాల్సి వస్తున్నదని, దీనివల్ల అదనంగా నిర్వహణ భారం పడుతున్నదని చెబుతున్నారు. తమకు అనుమతిస్తే ఎవరి పరిశ్రమలో వారు కొంతమేరకు విద్యుత్తును ఉత్పత్తి చేసుకునే వీలు కలుగుతుందని అంటున్నారు. విద్యుత్తుకు సంబంధించి వివిధ సమస్యలపై ఇటీవల తాము టీజీ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీకి వినతిపత్రం సమర్పించినట్టు పరిశ్రమ వర్గాలు తెలిపాయి. తమ వినతులు పరిష్కరించకుంటే మునుముందు పరిశ్రమలు కొనసాగించడం మరింత కష్టమవుతుందని వారు వివరించారు.

## ఫార్మా విలేజీల్లేవ్.. క్లస్టర్లే!..


## 1,000-2,000 ఎకరాల్లో ఏర్పాటుకు ప్రభుత్వ యోచన



**భూములు ఇచ్చేందుకు స్థానికులు ససేమిరా..**

ఫార్మాసిటీ స్థానంలోనే ఫార్మా క్లస్టర్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. సుమారు 1,000 నుంచి 2,000 ఎకరాల స్థలంలో ఈ క్లస్టర్‌ను ఏర్పాటు చేసేయోచనలో సర్కార్ ఉన్నది. ఇందుకు సంబంధించి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. సుమారు రూ. లక్ష కోట్ల పెట్టుబడితో 10 ఇంటిగ్రేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ ఫార్మా విలేజ్‌లను ఏర్పాటు చేస్తామని ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన బయోఏషియా-2024 సదస్సు సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం విదితమే. ముందుగా వికారాబాద్, మెదక్, నల్గొండలలో ఈ విలేజ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు, ఒక్కో విలేజ్‌ను వెయ్యి నుంచి రెండు వేల ఎకరాల్లో ఉంటుందని ఆయన తెలిపారు.అయితే ఈ మూడు జిల్లాల్లో ఒకేచోట 1000ఎకరాల భూమి అందుబాటులో లేదని కలెక్టర్లు తేల్చిచెప్పడంతో రాష్ట్ర సర్కార్ దీనిపై పునరాలోచనలో పడినట్లు తెలుస్తున్నది. కానీ ఎలాగైన వికారాబాద్‌లో ల్యాండ్ పూలింగ్ పద్ధతిలోనైనా ఫార్మా విలేజ్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నది. అయితే, అధికారులు క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లడం ఆలస్యం కావడం, భూములు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇచ్చేదిలేదని స్థానికులు తేల్చిచెప్పడంతోపాటు వారిని చుట్టుముట్టి ఆందోళన నిర్వహించారు. అయినప్పటికీ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.ఫార్మాసిటీ కోసం గతంలో వచ్చిన దరఖాస్తులు పెద్ద సంఖ్యలో పెండింగ్‌లో ఉండటంతో ఆయా పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా అవసరమైతే 2,000 ఎకరాల వరకైనా ఫార్మా క్లస్టర్‌ను అభివృద్ధి చేయాలనుకుంటున్నారు. అయితే, గతంలో ప్రతిపాదిత ఫార్మాసిటీలో అన్ని రకాల ఔషధ పరిశ్రమల ఏర్పాటునకు వెసులుబాటు కల్పించాలని నిర్ణయించగా, తాజాగా ప్రతిపాదిత ఫార్మా క్లస్టర్‌లో కాలుష్యం కలిగించే బల్క్‌డ్రగ్ పరిశ్రమలను మినహాయించాలని నిర్ణయించారు.ఫార్మారంగంలో తెలంగాణ రాష్ట్రానికి, ముఖ్యంగా హైదరాబాద్‌కు ఉన్న ప్రత్యేకతను సుస్థిరం చేసే విధంగా గత బీఆర్‌ఎస్ సర్కారు రంగారెడ్డి జిల్లా ముచ్చర్లలో సుమారు 14,029ఎకరాల్లో ఫార్మాసిటీ ఏర్పాటునకు ప్రతిపాదించినది తెలిసిందే. మొదటి దశలో 8,900ఎకరాల్లో ఔషధ పరిశ్రమల ఏర్పాటునకు అవసరమైన ప్రణాళికలను కూడా గత ప్రభుత్వం సిద్ధం చేసింది.

## దిగొస్తున్న పసిడి మీ నగరంలో ఇవాళ బంగారం ధరలు ఎంతంటే



కొంత కాలంగా స్వల్పంగా తగ్గుతూ వస్తున్న బంగారం ధరలు శుక్రవారం కూడా స్వల్పంగా తగ్గాయి. వారం రోజులుగా బంగారం ధరలో పెరుగుదల కనిపించడం లేదు. ఇవాళ బంగారం ధరలు రూ.100 మేర తగ్గాయి.ఈ ఏడాది భారత్‌లో బంగారం వినియోగం భారీగా పెరిగే అవకాశం ఉందని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ అంచనా వేస్తున్నందున.. ధరలు అమాంతం పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు. కాబట్టి.. గోల్డ్ కొనేవారికి ఇప్పుడే మంచి అవకాశం.దేశంలోని వివిధ ప్రాంతాలతోపాటు, తెలుగు రాష్ట్రాల్లో బంగారం ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం.కోల్‌కతాలో10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ. 66,680గా ఉండగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 72,750 వద్ద ఉంది.దేశ రాజధాని ఢిల్లీలో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగార ధర రూ. 66,830కాగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 72,900 వద్ద కొనసాగుతోంది.చెన్నైలో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ. 66,680గా ఉండగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 72,750 వద్ద కొనసాగుతోంది.ముంబయిలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 66,680గా ఉండగా, 24 క్యారెట్ల ధర రూ. 72,750వద్ద ట్రేడవుతోంది.తెలుగు రాష్ట్రాలు..తెలుగు రాష్ట్రాల్లోనూ బంగారం ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. హైదరాబాద్‌లో శుక్రవారం 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ. 66,680గా ఉండగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 72,750గా ఉంది. విజయవాడలో కూడా 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ. 66,680, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 72,750గా ఉంది. విశాఖపట్నం సహా ఏపీలోని ప్రధాన నగరాల్లోనూ ఇవే ధరలు కొనసాగుతున్నాయి.వెండి ధరలు...ఢిల్లీలో కిలో వెండి ధర రూ. 85,800గా ఉండగా.. కోల్‌కతాలో రూ. 84,900, బెంగళూరులో రూ. 82,800 వద్ద ట్రేడవుతోంది. హైదరాబాద్, విశాఖ, విజయవాడలో కిలో వెండి ధర అత్యధికంగా రూ. 89,900 గా ఉంది.

Editor, Printed, Published and Owned by Shaik Nazeer Ahmed Basha , H.NO. 3-104- 2 , Balajinagar, Kurnool - 518006, (A.P) , Printed at GK PUBLICATIONS , D.NO. 27/66, CHINNA MARKET, DIST. KURNOOL- 518001, ANDHRA PRADESH. E-mail : seemakiranamknl@gmail.com. RNI : APTEL / 2018/ 76380, Cell : 9133399830, 8919971019. website : - www.seemaakiranam.com , www.seemakiranamnews.com , epaper.seemakiranamnews.com